ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 7 : మంచిర్యాల జిల్లా ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధను తీసుకుంటున్నట్లు డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు పేర్కొన్నారు. సోమవారం ఎన్టీఆర్‌నగర్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రబలుతున్న జ్వరాలు, అసంక్రమణ వ్యాధులను నివారించేందుకు వ్యాధులను తొందరగా గుర్తించి, చికిత్స చేసేందుకు వైద్య శిబిరరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 115 మందికి పరీక్షలు చేసి, మందులు అందించినట్లు చెప్పారు. పొగాకు వాడకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రకాశ్ నాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో అనిత, ఓపీవోలు అనిల్, కృపావాయి, శివప్రతాప్, రమ్య, శేఖర్, డెమో వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాత పెన్షన్ హామీ అమలు చేయాలి



మాట్లాడుతున్న సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్

జన్నారం, అక్టోబర్ 7 : ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్‌ను వర్తింపజేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేయాలని సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్ కోరారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 1980 ఆంధ్రప్రదేశ్‌లో అప్పుడున్న పెన్షన్ ప్రకారం ప్రస్తుతం రాష్ట్రంలో అమలు చేసేందుకు సీఎం జీవో విడుదల చేసి ఉద్యోగ ఉపాధ్యాయులకు దసరా కనుగా ప్రకటించాలని కోరారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ప్రకాశ్ బానావత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నెమలికొండ కాంతయ్య పాల్గొన్నారు.

ఆ బాధ్యత మాకొద్దు

- జీపీల్లో నర్సరీల ఏర్పాట్లపై డీఆర్డీవోకు కోటపల్లి మండల కార్యదర్శుల వినతి

కోటపల్లి, అక్టోబర్ 7 : 'ఇప్పటికే గ్రామ పంచాయతీలకు నిధులు రాక అప్పులు చేసి, పారిశుధ్య కార్యక్రమాలు, ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. చేసిన పనులకు బిల్లులు మంజూరు కాక నానా అవస్థలు పడుతున్నాం. ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో నర్సరీల ఏర్పాటు అని చెప్పి మాపై అదనపు భారం మోపి మమ్మల్ని ఇబ్బందులకు గురి చేయవద్దు..' అని కోటపల్లి మండల పంచాయతీ కార్యదర్శులు డీఆర్డీవో కిషన్‌కు వినతి పత్రం సమర్పించారు. ప్రత్యేకాధికారుల పాలన మొదలైనప్పటి నుంచి పంచాయతీల్లో అన్నీ తామై వ్యవహరిస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం నర్సరీల ఏర్పాటు బాధ్యత తమపై మోపితే డబ్బు ఎక్కడి నుంచి పెట్టాలని వాపోయారు. ఆ బాధ్యతను తమ నుంచి తప్పించాలని వేడుకున్నారు.

గుండెపోటుతో యువకుడి మృతి

తాండూర్, అక్టోబర్ 7 : గుండెపోటుతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం తాండూర్ మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రంలోని విద్యా భారతి పాఠశాల విద్యార్థులు విద్యా భారతి బలగం ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నీమెంట్ ఏర్పాటు చేసుకున్నారు. శనివారం టోర్నీమెంట్ ప్రారంభమైంది. సోమవారం టోర్నీ జరుగుతుండగా, బారెవాడకు చెందిన రాచకొండ లక్ష్మీనారాయణ (38) పాల్గొన్నాడు. అనంతరం మిత్రులతో కలిసి, భోజనం చేసే సమయంలో అస్వస్థతకు గురై, సృహతప్పి పడిపోయాడు. వెంటనే బెల్లంపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు వెల్లడించారు. అప్పటి వరకూ తమతో ఉత్సాహంగా ఆడిన మిత్రుడు మృతిచెందడం వారిని తీవ్రంగా కలచివేసింది. లారీ డ్రైవర్‌గా జీవనం సాగించే లక్ష్మీనారాయణ అందరితో కలుపుగోలుగా ఉండేవాడని మిత్రులు పేర్కొన్నారు. ఆయన భార్య స్రవంతి, కూతురు ఉన్నారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

కోటపల్లి, అక్టోబర్ 7 : ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఆర్డీవో కిషన్ హెచ్చరించారు. కోటపల్లి మండల కేంద్రంలో సోమవారం 15వ విడుత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఎదుట తనికీ బృందాలు వారి నివేదికలను చదివి వినిపించారు. వలసలను నివారించడంతో పాటు, కూలీలకు ఉపాధి కల్పించేందుకు ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు కోటపల్లి మండలంలో రూ.5.1 కోట్లతో పనులను నిర్వహించారు. కొలతల్లో తేడాలు, కూలీలు పనులకు హాజరుకాకపోయినా వారి పేరిట డబ్బు డ్రా చేయడం తదితర విషయాలు బయటపడ్డాయి. బాధ్యులకు రూ.9 వేల జరిమానా విధించడంతో పాటు, రూ.17,116 రికవరీ చేశారు. ఎంపీడీవో ముల్కల్ల సత్యనారాయణ రెడ్డి, కొలిపాక భాస్కర్, ఏపీవోలు బాలయ్య, వెంకటేశ్వర్లు, కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి పెంపకం, విక్రయదారుల అరెస్ట్

తాండూర్, అక్టోబర్ 7 : తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లింగదరి గూడెంలో గంజాయి పెంచుతున్న జయరాంతో పాటు, ఎండు గంజాయిగా మార్చి విక్రయిస్తున్న తాండూర్ ఐబీ సుభద్ర కాలనీకి చెందిన జునైద్‌ఖాన్‌పై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డీ కిరణ్ కుమార్ తెలిపారు. లింగదరి గూడెంలో గంజాయి మొక్కలు పెంచుతున్నారని సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి, తనిఖీ చేయగా పెరట్లో ఏడు గంజాయి మొక్కలు లభించాయని పేర్కొన్నారు. వాటిని స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ సుమారు రూ. 70 వేలు ఉంటుందని తెలిపారు. జయరాం పెంచిన మొక్కలను జునైద్‌ఖాన్‌కు విక్రయిస్తున్నాడని, తాండూర్ పరిసర ప్రాంతాల్లో గంజాయి అమ్ముతున్నాడని పేర్కొన్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని, మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వారిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ వెల్లడించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 7 : కాగజ్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు నివాసంలో సోమవారం పలువురికి రూ.13, 69,000 విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గ ప్రజలు సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అక్రమ ఓటరు జాబితా నమోదుపై ఫిర్యాదు

కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 7 : కాగజ్‌నగర్ మండలం కోయగూడ గ్రామంలో అక్రమంగా ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేశారని, వాటిని తొలగించాలని కోరుతూ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాకు బీఆర్ఎస్ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు వినతి పత్రం అందించారు. ఓటరు జాబితాలో కొన్ని పేర్లు అక్రమంగా నమోదు చేశారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గమనించి, సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, అక్టోబర్ 7 : అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడాలని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. పాలస్తీనా (గాజా)పై మారణ హోమం మొదలై అక్టోబర్ 7తో ఏడాది పూర్తికావడంతో వామపక్ష పార్టీల ప్రపంచ, దేశవ్యాప్త నిరసన కార్యక్రమల పిలుపులో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద అమెరికా సామ్రాజ్య వాద దిష్టి బొమ్మను దహనం చేశారు. సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకుడు చాంద్ పాష, పీడీఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి, పట్టణ కమిటీ సభ్యులు శన్ను, సీపీఎం జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యుడు గొడిసెల కార్తిక్, సీపీఐ జిల్లా నాయకుడు ఆత్మకూరు చిరంజీవి తదితరులు ఉన్నారు.

బెల్లంపల్లి, అక్టోబర్ 7 : పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో అమెరికా సామ్రాజ్యవాద దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులు రాజం, ప్రశాంత్, శంకర్, విక్రమ్‌సింగ్, శ్రీనివాస్, మణిరామ్ సింగ్, తిరుపతి, చరణ్, భూమయ్య, తాళ్లపల్లి శ్రీనివాస్, చాంద్‌పాషా, రామ మౌళి పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్ : అర్జీలను స్వీకరిస్తున్న కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్ : జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు

నస్పూర్ : దరఖాస్తులు స్వీకరిస్తున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

దరఖాస్తుల పరిష్కారానికి కృషి చేయాలి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే
- ప్రజావాణిలో అర్జీల స్వీకరణ

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, అక్టోబర్ 7 : ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కరించే దిశగా కృషి చేస్తామని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణుతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆసిఫాబాద్ పట్టణం బజార్‌వాడి, సందీప్ నగర్, బ్రాహ్మణవాడకు చెందిన పలువురు.. ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలో వ్యాపారం చేసుకునేందుకు అనుమతి మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. దహెగాం మండలం మొట్లగూడ గ్రామానికి చెందిన ఎనగందుల సంచి.. కంప్యూటర్ పీజీడీసీఏ చేశానని, ఉపాధి కల్పించాలని.., చంద్రపెల్లి గ్రామానికి చెందిన దుర్గం మారుతి.. ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు పూర్తి చేశానని వైద్య కళాశాలలో ఉపాధి కల్పించాలని.., ఆసిఫాబాద్ మండలం బూరుగూడ గ్రామానికి చెందిన బొమ్మన రాజయ్య.. వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలని.., ఇప్పల్‌నవేగం గ్రామానికి చెందిన గుమ్మల విద్యాసాగర్.. దివ్యాంగ పింఛన్ ఇప్పించాలని.., వాంకిడి మండలం లంజన్ వీర గ్రామానికి చెందిన నగోష మోతీరాం.. కుటుంబంలో భూ వివాదం తలెత్తిందని న్యాయం చేయాలని.., పునుగూడకు చెందిన ఉయక గిర్జుబాయి.. భర్తకు ఖమాన గ్రామ శివారులో పట్టా భూమి ఉందని, ఆయన చనిపోగా, విరాసత్ చేసి పట్టా ఇప్పించాలని.., సరాండి గ్రామానికి చెందిన కుశ్నపల్లి నారాయణ.. పట్టా భూమి వివరాలు నమోదు చేసి కొత్త పట్టా పాసుపుస్తకం మంజూరు చేయాలని.., కెరమెరి మండలం కరంజివాడ గ్రామానికి చెందిన రాథోడ్ శ్రీనివాస్.. ఆర్వోఎఫ్ఆర్ పట్టా భూమికి సంబంధించి రైతు భరోసా డబ్బు ఇప్పించాలని అర్జీలు పెట్టుకున్నారు. సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై తక్షణమే పరిష్కరించాలి : ఎస్పీ శ్రీనివాస్‌రావు

ఆసిఫాబాద్ టౌన్, అక్టోబర్ 7 : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే పరిష్కరించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు పోలీసు అధికారులకు సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించి, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. తక్షణమే ఆయా పోలీస్ స్టేషన్లకు ఫోన్ చేసి మాట్లాడి పలు సూచనలు చేశారు. పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు : కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, అక్టోబర్ 7 : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల, నస్పూర్, బెల్లంపల్లి, మందమర్రి, క్యాతనపల్లి, దండేపల్లి నుంచి వచ్చిన ప్రజలు దరఖాస్తులు అందజేశారు. మొత్తంగా 30 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిశీలించి అధికారుల సమన్వయంతో పరిష్కరించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి, మంచిర్యాల ఆర్డీవోలు హరి కృష్ణ, రాములు, అధికారులు పాల్గొన్నారు.

ఆర్ట్, మ్యూజిక్ పోస్టులను భర్తీ చేయాలి

రాష్ట్ర వ్యాప్తంగా డీఎస్సీలో 1733 ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ జిల్లా ఆర్ట్ క్రాఫ్ట్ మ్యూజిక్ నిరుద్యోగుల అసోసియేషన్ నాయకులు వినతి పత్రం అందించారు. ఖాళీగా ఉన్న ఆర్ట్‌క్రాఫ్ట్, మ్యూజిక్ పోస్టులను భర్తీ చేయాలనే ఆలోచన ప్రభుత్వానికి లేకుండా పోయిందని, అభ్యర్థులు దాదాపు లక్ష మందికి పైగా రోడ్డున పడ్డారని పేర్కొన్నారు. సునీల్, దివ్య, రాజగోపాల్, జనార్దన్, భీమేశ్ పాల్గొన్నారు.

ఆక్రమణలను అడ్డుకోవాలి..

బెల్లంపల్లి, అక్టోబర్ 7 : బెల్లంపల్లిలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలను అడ్డుకోవాలని ఎంసీపీఐ(యూ) నాయకులు సబ్బని రాజేంద్రప్రసాద్, పసులేటి వెంకటేశ్, ఆరెపల్లి రమేశ్.. ప్రజావాణిలో కలెక్టర్ కుమార్‌దీపక్‌కు దరఖాస్తు సమర్పించారు. నియోజకవర్గంలోని అసైన్డ్, ప్రభుత్వ భూములను కొందరు నాయకులు అధికారులతో కుమ్మక్కై ప్లాట్లుగా చేసి, విక్రయిస్తున్నారని ఆరోపించారు. చొప్పరిపల్లి సెక్టార్‌కు చెందిన బూడిదగడ్డ బస్తీలోని అంగన్‌వాడీ కేంద్రం సరిగా తెరవడం లేదని, విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న టీచర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

కాసిపేటలో ఒకే శాఖకు పరిమితం..

ప్రజావాణిలో కూర్చున్న ఎంపీడీవో, ఎంపీవో, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్

కాసిపేట, అక్టోబర్ 7 : పైన ఫొటోలో చూసి ప్రజావాణిలో ఇంత మంది అధికారులు ఉన్నారేంటి అనుకునేరు..! వీరంతా ఒకే శాఖకు సంబంధించిన అధికారులే. అధికారులెవరూ రాకపోవడంతో ఆ కార్యాలయ అధికారులే ప్రజావాణిలో కూర్చొని, వారి పనులు చూసుకుంటూ ఇలా దర్శనమిచ్చారు. కాసిపేట ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం ఒక్క శాఖకే పరిమితం కావడం.. ఆయా శాఖల అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతీ సోమవారం నిర్వహించే కార్యక్రమానికి మండల పరిషత్ అధికారులు తప్ప ఎవరూ ఉండడం లేదని పలువురు అంటున్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి ఉంటున్నది కాబట్టి అదే శాఖ అధికారులు (మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల పంచాయతీ అధికారి, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు) తమ పనులు చేసుకుంటూ కనిపిస్తున్నారు. దీంతో ఇక ఫిర్యాదు చేసే వారు ఇక్కడికి రాకుండా నేరుగా జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజావాణికే వెళ్తున్నారన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా ప్రజావాణిలో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చింతలమానేపల్లి : కర్జెల్లి రేంజ్ పరిధిలో ర్యాలీ తీస్తున్న అటవీ శాఖ అధికారులు

మందమర్రి రూరల్ : చిర్రాకుంటలో మాట్లాడుతున్న డీఆర్వో కే గౌరి శంకర్

కాసిపేట : గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ రేంజర్ ప్రవీణ్ నాయక్

జాతీయ వన్యప్రాణి వారోత్సవాలు

చింతలమానేపల్లి, అక్టోబర్ 7 : జాతీయ వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని రవీంద్రనగర్‌లో గల కర్జెల్లి రేంజ్ కార్యాలయం నుంచి కోర్సిని అడవి వరకు అటవీ శాఖ అధికారులు, సిబ్బంది ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా వారు ఆయా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. వన్యప్రాణులను వేటాడవద్దని, అడవులను సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ అధికారులు అజ్మీరా మోహన్, సూర్యనారాయణ, అక్తర్, సూర్యారావ్, ఫారెస్ట్ బీట్ అధికారులు, దినేశ్, ప్రభాకర్, నవ్య శ్రీ రెడ్డి, శుక్రు, యానిమల్ ట్రాకర్స్, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మందమర్రి రూరల్, అక్టోబర్ 7 : జాతీయ వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా మండలంలోని చిర్రాకుంట గ్రామంలో అటవీ అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధులతో ఆదిలాపేట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కే గౌరీ శంకర్ సమావేశం నిర్వహించారు. అంతరించిపోతున్న అడవులు, మూగజీవాలను రక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉన్నదన్నారు. సమావేశంలో అటవీశాఖ అధికారులు శ్రీనివాస్, మంగ, మాజీ సర్పంచ్ ఒడ్నాల కొమురయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాసిపేట, అక్టోబర్ 7 : కాసిపేట మండలం ధర్మారావుపేట అటవీ సెక్షన్ పరిధిలోని బుగ్గగూడెం గ్రామంలో గ్రామస్తులకు అటవీ, వన్య ప్రాణుల సంరక్షణపై డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ నాయక్ అవగాహన

తిర్యాణి : ర్యాలీలో అటవీ శాఖ అధికారులు

కల్పించారు. వన్యప్రాణుల సంరక్షణతో పర్యాటక అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. కొత్తగా వచ్చిన వన్యప్రాణి సంరక్షణ చట్టం గురించి వివరించారు. ఇక్కడి పరిసరాల్లో సీతాకోక చిలుకల ఉద్యానవనం, పక్షులను వీక్షించేందుకు బుగ్గ చెరువు వద్ద బర్డ్స్ వ్యూ పాయింట్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అలాగే బుగ్గ దేవాలయ పరిసర ప్రాంతాలు ప్లాస్టిక్ రహిత ప్రదేశంగా చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ కుమారస్వామి, వాచర్ పోశం, గ్రామస్తులు పాల్గొన్నారు.

తిర్యాణి, అక్టోబర్ 7 : తిర్యాణి మండల కేంద్రంలోని చింతపల్లి చౌరస్తా, ఆయా కూడళ్ల మీదుగా కుమ్రం భీం చౌరస్తా వరకు అటవీ శాఖ అధికారులు బైక్ ర్యాలీ తీశారు. తిర్యాణి రేంజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. జిల్లా అటవీ శాఖ అధికారుల ఆదేశాల మేరకు వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహిస్తున్నటుల తెలిపారు. గిన్నెధరి అటవీ శాఖ అధికారి వెంకన్న, ఎఫ్ఎస్‌వో ఆత్రం రవీందర్, భీమ్లానాయక్ బీట్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

దేవీ శరన్నవరాత్రోత్సవాలు

ఆసిఫాబాద్ టౌన్ : సాయినగర్‌లోని దుర్గాదేవి మండపం వద్ద పూజల్లో పాల్గొన్న మహిళలు

ఆసిఫాబాద్ టౌన్, అక్టోబర్ 7 : దుర్గా దేవి శరన్నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాల వద్ద సోమవారం నిర్వాహకులు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. స్థానిక సాయినగర్‌లోని భజరంగ్ యూత్ ఆధ్వర్యంలో వేద పండితులు నిమ్మకంటి సంతోష్ శర్మ ఆధ్వర్యంలో 5వ రోజు మహా చండీ ఆవతారంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సహస్ర నామ కుంకుమార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సాయంత్రం అమ్మవారిని శాకాంబరి ఆవతారంలో పూజలు చేశారు. కమిటీ అధ్యక్షుడు కురాట్కర్ శంకర్ పాల్గొన్నారు.

లక్షెట్టిపేట, అక్టోబర్ 7 : గోదావరి రోడ్డు సాయిగణేశ్ భక్త మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. వేద పండితులు ముద్దు ప్రణవ్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి నైవేద్యాలను సమర్పించి, నారాయణ సేవ చేశారు. గట్ల సత్యనారాయణ–శారధ దంపతుల సహకారంతో అన్నప్రసాద వితరణ చేపట్టారు.

రెబ్బెన, అక్టోబర్ 7 : రెబ్బెన మండలం ఇందిరానగర్ శ్రీ కనకదుర్గాదేవి స్వయంభూ మహంకాళి దేవస్థానంలో అమ్మవారు శ్రీ మహాచండీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పట్టు వస్త్రాలు, నైవేద్యాలు, ఒడిబియ్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకుడు దేవర వినోద్‌స్వామి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మోడెం తిరుపతిగౌడ్ అన్నదానం ఏర్పాటు చేశారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఆసిఫాబాద్ టౌన్, అక్టోబర్ 7 : ఐకేపీ వీవోఏల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం డీఆర్డీవో దత్తారాం కు వినతి పత్రం అందజేశారు. దసరా పండుగ నేపథ్యంలో వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ వీవోఏల సంఘం జిల్లా కార్యదర్శి జ్యోతి, మండల అధ్యక్షురాలు బొడ్డు కళ్యాణి, పద్మ, ఫర్జాన, శారద తదితరులున్నారు.

నియామకం

మందమర్రి, అక్టోబర్ 7 : జాతీయ బీసీ సంక్షేమ సంఘం మందమర్రి పట్టణ సోషల్ మీడియా ఇన్‌చార్జిగా కూకట్ల తిరుపతి యాదవ్ నియామకమయ్యారు. ఈ మేరకు సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘం పట్టణాధ్యక్షుడు సకినాల శంకర్, నాయకులు తిరుపతికి నియామక పత్రం అందజేశారు. తనకు బాధ్యతలు అప్పగించిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఊదరి చంద్రమోహన్ గౌడ్, పట్టణాధ్యక్షుడు సకినాల శంకర్, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

అటవీశాఖ క్వార్టర్స్ ప్రారంభం

జన్నారం, అక్టోబర్ 7 : జన్నారం రేంజ్ పరిధిలో ఎఫ్ఎస్‌వో, ఎఫ్బీవోల నివాసం కోసం నిర్మించిన క్వార్టర్స్‌ను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సోమవారం ప్రారంభించారు. అనంతరం పొనకల్, తపాలాపూర్, చింతగూడ గ్రామాల్లో సీసీరోడ్లు, డైనేజీలు, రోటిగూడలో ప్రైమరీ హెల్త్ సెంటర్, సీసీరోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. పొనకల్‌లో సద్దుల బతుకమ్మ సంబురాలు నిర్వహించే ప్రదేశాన్ని పరిశీలించారు. అధ్యక్షుడు ముజఫర్ అలీఖాన్, మేకల మాణిక్యం, నాయకులు మిక్కినినేని రాజశేఖర్, సయ్యద్ ఇసాక్, ఏ శుభాష్‌రెడ్డి, దుమల్ల రమేశ్, ప్రవీణ్, ముత్యం సతీశ్, బీ రాజన్న, రియాజుద్దీన్ పాల్గొన్నారు.

వంకులంలో దొంగతనం

రెబ్బెన, అక్టోబర్ 7 : రెబ్బెన మండలం వంకులం గ్రామానికి చెందిన బోర్కుటే నానాజీ ఇంట్లో దొంగతనం జరిగినట్లు రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. నానాజీ అనారోగ్యం కారణంగా 4వ తేదీన కాగజ్‌నగర్‌లోని దవాఖానకు వెళ్లి, చికిత్స తీసుకొని 6వ తేదీన ఇంటికి వచ్చారు. ఇంటి వెనుక తలుపు పగలగొట్టి ఉంది. చెక్క బీరువాలోని రూ.90 వేల విలువ గల బంగారం, రూ.8,500 విలువ గల వెండి ఎత్తికెళ్లారు. నానాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినటుల ఎస్ఐ తెలిపారు.

భీమయ్యక్ ఆలయంలోనే దసరా వేడుకలు

సమావేశమైన కొలాం ఆదివాసులు

కెరమెరి, అక్టోబర్ 7 : మండలంలోని చిన్న పాట్నాపూర్ భీమయ్యక్ దేవాలయంలో 12న వైభవంగా దసరా వేడుకలు జరుపుకుందామని ఆలయ కమిటీ చైర్మన్ ఆత్రం ధర్ము పేర్కొన్నారు. గ్రామంలో సోమవారం కులపెద్దలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఓం రాజ్ వంగేపురి భీమయ్యక్ దేవత వద్ద పూజ చేసిన తర్వాతనే ఇంటి వద్ద దసరా వేడుకలు జరుపుకోవాలని సూచించారు. ఆత్రం వంశీయులు పెద్ద సంఖ్యలో హాజరై, విజయవంతం చేయాలని కోరారు. కార్య నిర్వాహకులు ఆత్రం పెద్ద భీము, మారుతి, మాదోరావ్, సిడాం భీంరావ్, ఆత్రం సోనేరావ్, భీంరావ్ పాల్గొన్నారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

లక్షెట్టిపేట,అక్టోబర్ 7 : మండలంలోని చెల్లంపేట గ్రామానికి చెందిన జైనేని భీమక్క(35) ఆదివారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నదని ఎస్ఐ సతీశ్ సోమవారం తెలిపారు. భీమక్కకు అదే గ్రామానికి చెందిన జైనేని రవితో 20 ఏళ్ల క్రితం పెండ్లి కాగా, సంతానం కలుగలేదు. ఇద్దరు కూలీ పని చేసుకుంటూ వచ్చిన డ